మనం
కడప | అన్నమయ్య

## చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం



సిద్ధవటం మనం న్యూస్ సెప్టెంబర్ 27
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెత్రుత్వంలో ఉపముఖ్య మంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాజంపేట ఇంచార్జి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో సిద్దవటం మండల పరిధిలోని టక్కోలి బిసి కాలనీలో మాజీ సర్పంచ్ లక్ష్మి దేవి ఆధ్వర్యంలో చెత్త సేకరణ మరియు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు చెత్త బుట్టలు, సంచులు పంపిణీ చేశారు. ఇళ్లలో పొడిచెత్త, వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ కాగితాలు, అట్టపెట్టెలను సంచులలో నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి వచ్చే స్వచ్ఛ రథం (చెత్త సేకరణ వాహనం)లో ఈ చెత్తను అందజేస్తే, వారికి ప్రతిఫలంగా నిత్యావసర వస్తువులను అందజేస్తారని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా ఉండవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మిదేవి, శంకర్, బూత్ కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, ఆవుల చిన్నయ్య, ధన, ముక్కమ్మల చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.





# కలిసికట్టుగా సాగుదాం.. కూటమిని గెలిపిద్దాం!

### జనసేన పార్లమెంట్ ఇంచార్జ్ యల్లటూరుతో టీడీపీ నేతల ఆత్మీయ భేటీ

### యల్లటూరు భవన్‌లో సుహృద్భావ చర్చలు.. సమన్వయానికి పెద్దపీట



మనం ప్రతినిధి రాజంపేట, నియోజకవర్గంలో కూటమి ఐక్యతను చాటుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను మరింత పటిష్టం చేసే దిశగా తెలుగుదేశం, జనసేన నాయకులు ముందడుగు వేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం 'యల్లటూరు భవన్'లో రాజంపేట పార్లమెంట్ జనసేన ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజును మిత్రపక్షమైన తెదేపా ముఖ్య నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. సుహృద్భావ వాతావరణంలో సాగిన ఈ భేటీ నియోజకవర్గ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

**క్షేత్రస్థాయిలో సమన్వయమే పరమావధి**

రాష్ట్రంలో కూటమి పాలన ప్రజలకు చేరువవుతున్న తరుణంలో, రాజంపేట నియోజకవర్గంలోనూ ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై నడవాల్సిన అవసరం ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే విషయంలో పరస్పర సహకారంతో పనిచేయాలని నిర్ణయించారు. చిన్నపాటి విభేదాలు, అపోహలకు తావులేకుండా మండల, గ్రామ స్థాయిల్లో కూటమి బంధాన్ని మరింత దృఢంగా నిర్మించేందుకు ప్రణాళికాబద్ధంగా సాగాలని నాయకులు ఒక నిర్ణయానికి వచ్చారు.

**క్యాడర్‌లో నూతనోత్సాహం:**

ఈ ఆత్మీయ కలయిక ఇరు పార్టీల కేడర్‌లో కొత్త జోష్ నింపింది. రాబోయే రోజుల్లో కూటమిని రాజంపేటలో ఎదురులేని శక్తిగా నిలబెట్టేందుకు ఐక్య కార్యాచరణతో ముందుకు సాగుతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు డాక్టర్ దగ్గుబాటి నవీన్, పట్టణ అధ్యక్షుడు దగ్గుబాటి సుబ్రమణ్యం నాయుడు (డీఆర్ఎల్ మణి), రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లి ప్రతాప్ రాజు, బీసీ నేత ఇడిమడకల కుమార్, తెదేపా మాజీ మండల అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు, నాయకులు చిన్నయ్య, ఎస్.కె.కరీం, రాము యాదవ్, కొల్లి రెడ్డెయ్య, నూగల రమేష్, ఎన్టీఆర్ కేశవ పాల్గొన్నారు.

# అక్టోబర్ 2న చంద్రబాబు, నిర్మలా సీతారామన్ రాక

### మదనపల్లెలో అధికారుల ముమ్మర ఏర్పాట్లు



మనం ప్రతినిధి మదనపల్లె, సెప్టెంబర్ 27
అక్టోబర్ 2న పట్టణంలో జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటనకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఆదివారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ఎమ్మెల్యే షాజహాన్ భాషా, సీఎం పర్యటన సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జేసీ శివనారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిలతో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. చంద్రకాలనీ, బీకేపల్లి, వెన్నెల రెస్టారెంట్ వెనుక వైపు ప్రాంతాల్లో సభా ప్రాంగణం, హెలిప్యాడ్ నిర్మాణం, వాహనాల పార్కింగ్ స్థలాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రముఖుల పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులే కుండా పకడ్బందీ ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సభకు భారీగా తరలివచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. వేదిక పరిసరాల్లో తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్, బారికేడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య పనులను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు దారిమళ్లింపులు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. సభా ప్రాంగణంలో బందోబస్తుపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పీలేరు ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## చెకుముకి సైన్స్ పరీక్షలో శ్రీ సాయి విద్యాలయ విద్యార్థుల ఘన విజయం

### జిల్లా స్థాయిలో 3వ ర్యాంక్

మనంన్యూస్ రాజంపేట సెప్టెంబర్27: విద్యార్థుల్లో దాగివున్న సైన్స్ నైపుణ్యాన్ని వెలికితీసే ప్రతిష్టాత్మక 'చెకుముకి టాలెంట్ టెస్ట్'లో స్థానిక శ్రీసాయి విద్యాలయ విద్యార్థులు జిల్లా స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి మన రాజంపేటకు గర్వకారణంగా నిలిచారు. ముందుగా రాజంపేట మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన బాలకృష్ణ, గోపిశర్మ మరియు కీర్తిశ్రీ అనే ముగ్గురు విద్యార్థులు, జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని తీవ్ర పోటీని తట్టుకుని తృతీయ స్థానం (3వ ర్యాంక్) సాధించారు. ఈ ఘన విజయం సాధించిన విద్యార్థులను పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ా. బాలరాజు, హెడ్ మాస్టర్ రేణుకాదేవి, డైరెక్టర్లు అరవ రమణయ్య, చౌదరి, వేణుగోపాల్ మాట్లాడారు. "పుస్తకాల్లో చదివే చదువుతో పాటు సైన్స్ పట్ల ఆసక్తి, కొత్త విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉంటేనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయి.

బాలకృష్ణ, గోపిశర్మ, కీర్తిశ్రీ చూపిన ప్రతిభ మిగతా విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదా యకం. ప్రతి విద్యార్థి ఇలాంటి వైజ్ఞానిక పోటీలలో పాల్గొని తమలోని ప్రతిభను నిరూపించుకోవాలి. కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని ఈ విద్యార్థులు నిరూపించారు. వీరు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కూడా రాణించి మన ప్రాంతానికి మరిన్ని విజయాలు అందించాలని కోరుకుంటున్నాం." ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు.

# రాజంపేట మున్సిపల్ చైర్మన్ టికెట్ మాకే ఇవ్వండి

## సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డికి శ్వేతా రెడ్డి, బలిజపల్లి చిన్న వినతి

### అన్ని వర్గాల మద్దతు మాకే ఉంది.. గెలిచి తీరుతాం: నాయకుల ధీమా

### సామాజిక సమీకరణాలపై సానుకూలంగా స్పందించిన జిల్లా ఇన్‌ఛార్జ్ గునిపాటి దీపక్ రెడ్డి







రాజంపేట:మనం ప్రతినిధి
రాజంపేట పురపాలక సంఘం పీఠాన్ని దక్కించుకునే సత్తా తమకు ఉందని, స్థానిక పరిస్థితులు, సామాజిక సమీకరణాలు తమకు పూర్తి అనుకూలంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు శ్వేతా రెడ్డి, ప్రముఖ నేత రాఘవేంద్ర కుమార్ (బలిజపల్లి చిన్న) స్పష్టం చేశారు.

సీడాప్ రాష్ట్ర చైర్మన్, కడప జిల్లా పార్టీ ఇన్‌ఛార్జ్/అబ్జర్వర్ గునిపాటి దీపక్ రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాజంపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వాన్ని తమకే కేటాయించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

ఈ భేటీ సందర్భంగా వారు నియోజకవర్గ, మున్సిపాలిటీ పరిధిలోని రాజకీయ, సామాజిక సమీకరణాలను జిల్లా ఇన్‌ఛార్జ్ దీపక్ రెడ్డికి వివరంగా నివేదించారు.

**ప్రధాన సామాజిక వర్గాల మద్దతు మాకే:**

రాజంపేట మున్సిపాలిటీలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన బలిజ, రెడ్డి సామాజిక వర్గాలు తమ వెంటే ఉన్నాయని వారు వివరించారు. అంతేకాకుండా మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలతో కూడా తాము మొదటినుంచీ సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉన్నామని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, నిత్యం ప్రజల్లో ఉంటున్నందున అన్ని వర్గాల్లోనూ తమకు విస్తృతమైన ఆదరణ ఉందని గుర్తుచేశారు.

**పార్టీని విజయతీరాలకు చేరుస్తాం:**

అభ్యర్థి ఎంపికలో ప్రజాబలం, గెలుపు అవకాశాలే ప్రామాణికమైతే తమకే అత్యధిక అవకాశాలు ఉన్నాయని శ్వేతా రెడ్డి, బలిజపల్లి చిన్న పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం తమ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తే, కార్యకర్తలను, అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి రాజంపేట మున్సిపాలిటీపై పార్టీ జెండాను ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**సానుకూలంగా స్పందించిన గునిపాటి దీపక్ రెడ్డి:**

శ్వేతా రెడ్డి, బలిజపల్లి చిన్న సమర్పించిన వివరాలను, స్థానిక సమీకరణాలను సీడాప్ చైర్మన్ గునిపాటి దీపక్ రెడ్డి శ్రద్ధగా ఆలకించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు, గెలుపు గుర్రాలను బరిలోకి దించేందుకు అధిష్ఠానం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ వీరి వినతిపై పూర్తి సానుకూలత వ్యక్తం చేశారు.

స్థానిక పరిస్థితులు, సామాజిక మద్దతు తదితర అంశాలను పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి సరైన నిర్ణయం వెలువడేలా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సేవలందించడం అందరి లక్ష్యం కావాలి: మానవత




చిట్వేలి సెప్టెంబర్ 27 మనం న్యూస్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నెలవరి సమావేశాన్ని స్థానిక స్థాయి వికాస్ పాఠశాల నందు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఈ నెలలో చేసిన సేవ కార్యక్రమాలను శాంతిరథం బాడీ ఫ్రీజర్ల విషయాలను సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి ఒక్కరికి మానవతా సేవలు విస్తరింపజేసేలా అందరి లక్ష్యంగా చేసుకొని సభ్యత్వాలను విస్తరింప చేయాలని సభ్యులందరూ తీర్మానించడం జరిగింది. గ్రామాల్లో మానవతా బలోపేతానిపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే గ్రూప్లోని సభ్యులు రెన్యువల్ను చేసుకొని మానవతా బలోపేతానికి సభ్యులు సహకరించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దొండ్లవాగు శ్రీనివాసులు, కార్యదర్శి సుబ్రమణ్యరెడ్డి, ట్రెజరర్ తిరుమలరెడ్డి, చైర్మన్ వీరాంజనేయ రాజు, కో చైర్మన్ మునిరావు, కన్వీనర్ సాయిరాం, గౌరవ అధ్యక్షులు రంగారెడ్డి, తిరుమల విశ్వనాథం, గౌరవ అడ్వైజర్ బోర్డ్ నెంబర్లు కావేరి చంద్ర, చౌడవరం సురేంద్రారెడ్డి, సభ్యులు కామాటం వెంకటేశ్వర్లు, నరసరామయ్య, రోళ్ల మోహన్, శంకరయ్య, చలమారెడ్డి, హరినాథ్, సుబ్బరాజు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రం జాషువా సాహిత్య సేవా పురస్కారం అందుకున్న పసుపుల రాజశేఖర్



చిట్వేలీ సెప్టెంబర్ 27 మనం న్యూస్: చిట్వేలి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు మరియు ఎన్సిసి అధికారి విధులు నిర్వహిస్తున్న పసుపుల రాజశేఖర్, అంతర్జాతీయ సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ ఉషోదయ ఫౌండేషన్, తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కవిత, గేయ పోటీలలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచినందుకు ఆయనకు గుర్రం జాషువా సాహిత్య సేవా పురస్కారం ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేట లెనిన్ నగర్ జ్యోతిరావు పూలే కళ్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. ఈ పురస్కార ప్రదాన కార్యక్రమంలో పసుపుల రాజశేఖర్‌ను జాషువా పురస్కార ప్రశంసా పత్రం, శాలువ, మెమెంటో, పూలదండతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఉషోదయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డా.ధనాసి ఉషారాణి, తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యూవీ రత్నం సంయుక్తంగా ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు విజయకుమార్, లీలా మోహన్ కృష్ణ, పల్నాడు జిల్లా ఏపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు స్వర్ణ చినరామిరెడ్డి, దైవజ్ఞ రత్న, స్వర్ణ కళాభిజ్ఞ డా. బొక్క శ్రీనివాస్ రావు, ప్రభుత్వ తెలుగు అధ్యాపకులు పసల గీతా కళ్యాణి తదితరులు పాల్గొని రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పసుపుల రాజశేఖర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, సాహిత్యకారులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు అభినందనలు తెలిపారు. సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పద్య సూక్తులు పోటీలలో న సరస్వతి విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

సిద్ధవటం సెప్టెంబర్ 26(మనం న్యూస్) సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పద్య సూక్తులు పోటీలలో మాధవరం శ్రీ సరస్వతి విద్యాలయం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారని కరెస్పాండెంట్ నట్టా బుజ్జమ్మ తెలిపారు. కడప స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో ప్రొద్దుటూరు, కడప, సిద్దవటం, మాధవరం ప్రాంతాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరిలో శ్రీ సరస్వతి విద్యాలయం విద్యార్థి అయాన్ మూడవ బహుమతి (3 వ బహుమతి) సాధించడం పాఠశాలకు ఎంతో గర్వకారణం అన్నారు ఆయాన్ కు విద్యాలయం తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు 4వ తరగతి విద్యార్థిని దివ్య, 3వ తరగతి విద్యార్థి నావతేజ ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు సాధించినందుకు వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



# వినాయకుని నిమజ్జనం కార్యక్రమంలో సుగవాసి ప్రసాద్ బాబు





రాయచోటి సెప్టెంబర్ 27(మనం న్యూస్)
పాత రాయచోటి మాలపల్లెలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమజ్జన ఊరేగింపు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.అలాగే నీటి ప్రదేశాల వద్ద జాగ్రత్తలు పాటిస్తూ, విద్యుత్ తీగలు మరియు ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని, పోలీసుల సూచనలు–నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. "వినాయకుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి వెల్లివిరియాలి" అని సుగవాసి ప్రసాద్ బాబు ఆకాంక్షించారు.

# నకిలీ పులి చర్మాల ముఠా అరెస్టు

**వన్యప్రాణుల పేరిట భారీ మోసం**

**మారువేషంలో వెళ్లి పట్టుకున్న అటవీశాఖ అధికారులు**

**అసలైన జింక చర్మం, 5 నకిలీ పులి చర్మాలు, 23 నకిలీ గోళ్లు స్వాధీనం**



మనం ప్రతినిధి కడప
వన్యప్రాణుల చర్మాల పేరిట సాగుతున్న దందాకు అటవీశాఖ అధికారులు తెరదించారు. చిరుత, పులి చర్మాల కొనుగోలు, విక్రయాలకు పాల్పడుతున్న ముఠా ఆటకట్టించి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి ఒక అసలైన మచ్చల జింక చర్మంతో పాటు 5 నకిలీ పులి చర్మాలు, 23 నకిలీ గోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

**కొనుగోలుదారుల ముసుగులో వల..**

కడప పరిసరాల్లో చిరుత, పులి చర్మాల విక్రయానికి బేరసారాలు సాగుతున్నట్లు అటవీశాఖ అధికారులకు ముందస్తు సమాచారం అందింది. కర్నూలు కన్సర్వేటర్ మార్గదర్శకత్వంలో కడప డీఎఫ్‌వో టి.రాజశేఖర్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. అధికారులు స్వయంగా కొనుగోలుదారుల అవతారమెత్తి, డ్రైవర్ ద్వారా నిందితులతో సంప్రదింపులు జరిపారు. బెంగళూరు నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులను మైదుకూరు వరకు అనుసరించారు.

**ఆకస్మిక దాడి.. నిందితులు కటకటాల్లోకి**

మైదుకూరు సమీపంలోని విక్రేత నివాసంలోకి నిందితులు ప్రవేశించగానే అటవీ సిబ్బంది మెరుపుదాడి చేశారు. ఇంట్లో సోదాలు నిర్వహించి మచ్చల జింక అసలైన చర్మంతో పాటు, పులి చర్మాలను పోలిన అయిదు నకిలీ చర్మాలు, 23 నకిలీ గోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్) పశువైద్య బృందం వీటిని పరిశీలించి.. జింక చర్మం మాత్రమే అసలైనదని, పులి చర్మాలు, గోళ్లు నకిలీవని నిర్ధారించింది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన బద్వేలు రేంజర్ నయీమ్, ఆయన బృందాన్ని, కేసు దర్యాప్తు చేస్తున్న ప్రొద్దుటూరు రేంజర్ హేమాంజలిని డీఎఫ్‌వో రాజశేఖర్‌బాబు అభినందించారు. వన్యప్రాణులకు హాని తలపెట్టినా, వాటి పేరిట నకిలీ దందాలు సాగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పర్యాటక వైభవంలో కడప ముందంజ: జిల్లాకు రెండు రాష్ట్ర అవార్డులు






మనం న్యూస్ కడప సెప్టెంబర్ 27
వైఎస్సార్ కడప జిల్లా పర్యాటక రంగంలో సరికొత్త చరిత్ర లిఖిస్తూ రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో జిల్లా రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలను కైవసం చేసుకుంది. కళలు, సంస్కృతి మేళవింపుతో జిల్లాను పర్యాటక పటంలో నిలిపినందుకు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి 'పర్యాటక అత్యుత్తమ అవార్డు' దక్కగా, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించిన పులివెందుల వైఎస్సార్ బస్ టెర్మినల్‌కు 'ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ బస్టాండ్' అవార్డు లభించింది. ఈ గౌరవం జిల్లా అధికార యంత్రాంగం, క్షేత్రస్థాయి ఉద్యోగుల సమిష్టి కృషికే దక్కిందని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటేలా గండికోటను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సుమారు రూ.19కోట్లతో రహదారులు, తాగునీరు, విద్యుత్, రాక్ క్లైంబింగ్, కయాకింగ్ వంటి సాహస క్రీడలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. జనవరిలో రాష్ట్ర పండుగగా నిర్వహించిన గండికోట ఉత్సవం దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందిందని, దీని ద్వారా స్థానిక యువత, వ్యాపారులకు భారీగా ఉపాధి లభించిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో పెన్నా లోయపై అద్దాల వంతెన, రోప్‌వే, బంగీ జంపింగ్ వంటి ఆధునిక ఆకర్షణలను సిద్ధం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ?మరోవైపు అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దిన పులివెందుల డాక్టర్ వైఎస్సార్ బస్ టెర్మినల్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ ప్రశంసించారు. 55 సీసీ కెమెరాల నిఘా, ప్రయాణికుల కోసం నిరీక్షణ మందిరాలు, ఆర్వో సురక్షిత జలం, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు, నగదు రహిత లావాదేవీలతో ఈ బస్టాండ్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ఈ పురస్కారాలు జిల్లా అభివృద్ధిపై మరింత బాధ్యతను పెంచాయని, వైఎస్సార్ కడప జిల్లాను వారసత్వ, పర్యావరణ, సాహస పర్యాటకానికి ప్రధాన చిరునామాగా మార్చేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది ఇదే ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## బోడె రామచంద్ర అన్న యువసేన ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి ఆర్థిక సహాయం



చిట్వేలీ సెప్టెంబర్ 27 మనం న్యూస్: చిట్వేలి మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నూకరాజు సుబ్బారావు అనారోగ్యం కారణంగా ఇబ్బంది పడుతున్న సందర్భంగా భారత చైతన్య యువజన పార్టీ (రామచంద్రన్న యువసేన )వారి ఆధ్వర్యంలో 42,000 వేలు, అలాగే శ్రీ కృష్ణ యాదవ సేవ సమితి వారి ఆధ్వర్యంలో 10,000 వేల రూపాయలు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ ఆర్థిక సహాయానికి సహకరించిన వారు తాలూరి సుబ్రహ్మణ్యం, నాగినేని రమణయ్య, తాలూరి కనకయ్య, ఆనంగి చంద్ర, చింకర్ల భాను ప్రసాద్, దేవినేని లక్ష్మి నారాయణ, ముదినేని చంగల్ రాయుడు, సల్లకంచు రామకృష్ణకు నూకరాజు సుబ్బా రావు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం, ఎదుటి వారి బాధను, సమస్యలను పట్టించుకోవడం సాటి మనుషులుగా సహాయం చేసుకోవడం చాలా గొప్ప శుభ పరిణామమని అన్నారు. ఆపదలో ఉన్నవారికి, అలాగే పేదవారికి రామచంద్రన్న యువసేన ఆధ్వర్యంలో మేము సహాయం చేయడంలో ఇప్పుడు ముందుంటామని రామచంద్రన్న యువసేన సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై సభ్యులు గొబ్బిల్ల సుదర్శన్, బొల్లి వెంకటేష్, ముదినేని చంగల్ రాయుడు, తిరుపతి జిల్లా యూత్ కో కన్వీనర్ నూకరాజు సందీప్ యాదవ్, రైల్వేకోడూరు మండలం కో కన్వీనర్ నాగేళ్ల నాగేష్, మేకల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై రీల్స్ చేయండి.. బహుమతులు గెలవండి

**కడప కలెక్టర్ శ్రీధర్ పిలుపు**

**సెప్టెంబరు 30 మధ్యాహ్నం 12 వరకు గడువు**



మనం న్యూస్ కడప: రాయలసీమతో పాటు ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక రీల్స్ పోటీ నిర్వహిస్తున్నట్లు కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ ప్రాజెక్టు లక్ష్యాలు, ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఆసక్తికర రీల్స్ రూపొందించే ఔత్సాహికులకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 27 నుంచి 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు 60 నుంచి 90 సెకన్ల నిడివితో కూడిన లఘు వీడియోలను తయారుచేసి పంపించాలని సూచించారు. రూపొందించిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసేటప్పుడు అధికారిక ఖాతా ఖజూుఎఅస్త్రఘ్శ్రీఎశీతీజూ ను తప్పనిసరిగా ట్యాగ్ చేయాలని స్పష్టం చేశారు. అందిన ఎంట్రీల నుంచి అత్యుత్తమ సృజనాత్మకత కనబరిచిన ఐదు వీడియోలను ప్రత్యేకంగా ఎంపిక చేసి, అక్టోబరు 1వ తేదీన విజేతలను ప్రకటించి బహుమతులు అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని కంటెంట్ క్రియేటర్లు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.